క్లుప్తంగా

కూలీల సంఖ్య పెంచండి



మాట్లాడుతున్న పరమేశ్వర్

రుద్రవరం: మండలంలో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని సీడీసీఎల్ ఆర్‌సీ కోర్సు డైరెక్టర్ పరమేశ్వర్ సూచించారు. స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో 2,005 మంది కూలీలు మాత్రమే ఉపాధి పనులకు వస్తున్నారని, ఆ సంఖ్యను 3,500కు పెంచాలని ఆదేశించారు. అలాగే ఉద్యాన పంటలు 350 ఎకరాలు లక్ష్యం కాగా కేవలం 130 ఎకరాలు మాత్రమే చేశారన్నారు. త్వరగా నిర్దేశిత లక్ష్యం పూర్తి చేయాలని చెప్పారు. కూలీల పని ప్రదేశంలో నీడ వసతి కల్పించాలన్నారు.ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రషీద్, ఏపీఓ ప్రతాప్ ఉన్నారు.

గడ్డివాములు దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

నంద్యాల(అర్బన్): మండలంలోని కంపెనీ కొట్టాల (రామకృష్ణనగర్)కు చెందిన రైతు బద్రి గడ్డివాములు దగ్ధమయ్యాయి. బుధవారం మధ్యాహ్నం ఓ వైపు నుంచి మంటలు రావడంతో గ్రామస్తులు ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపులోకి రాకపోవడంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారమిచ్చారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి యోగేశ్వరరెడ్డి వెంటనే స్పందించి సిబ్బందిని పంపగా వారు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. దాదాపు రూ.4.40లక్షల గడ్డివాములు దగ్ధం కావడంతో రైతు కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తుంది.

వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు

నంద్యాల(అర్బన్)/(సిటీ): మండలంలోని అయ్యలూరు గ్రామానికి చెందిన 27 మంది గ్రామ వలంటీర్లు రాజీనామా చేశారు. రాజీనామాలు సమర్పించేందుకు ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన వలంటీర్లు స్థానికంగానే రాజీనామాలు ఇవ్వవచ్చన్న ఎంపీడీఓ వివరణతో గ్రామ డీడీఓ అక్బర్‌వలికి రాజీనామా పత్రాలు అందజేశారు. వలంటీర్లు ఫణీంద్రారెడ్డి, మల్లేష్, ఇర్ఫాన్, శివలింగం మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఎన్నికలకు వలంటీర్లు దూరంగా ఉండాలనే ఆదేశాలను పాటిస్తూ రాజీనామా సమర్పించామన్నారు. జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవడమే తమ లక్ష్యమని చెప్పారు. అలాగే పట్టణంలోని 15వ వార్డుకు చెందిన ఐదుగురు వార్డు వలంటీర్లు రాజీమానా పత్రాలను మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డికి అందజేశారు. రాజకీయాలకు అతీతంగా సేవలు అందిస్తున్నామని, అలాంటి తమను టీడీపీ నాయకులు పింఛన్ పంపిణీ చేయనివ్వకుండా అడ్డుకోవడం, నిందలు వేస్తూ మాట్లాడటం దారుణమన్నారు.

లబ్ధిదారులందరికీ పింఛన్లు పంపిణీ చేయాలి



29వ వార్డు సచివాలయంలో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి

నంద్యాల(సిటీ): పట్టణంలోని 48 వార్డుల్లో లబ్ధిదారులందరికీ పింఛన్లు పంపిణీ చేయాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో ఉదయం ఏర్పాట్లను పరిశీలించారు. ఉదయం నుంచే సచివాలయాలకు వస్తున్న వృద్ధులు, వితంతువులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని 48 వార్డుల్లోని సచివాలయాలలో పింఛన్ పంపిణీకి ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. 8 ప్రాంతాల్లో ప్రత్యేకంగా టెంట్లు, అన్ని సచివాలయాల్లో మంచినీటి సదుపాయాలు కల్పించామన్నారు. ఎన్నికల విధుల్లో లేని సిబ్బంది సహకారంతో పింఛన్లు పంపిణీ చేయిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పింఛన్లను నాలుగు కేటగిరీలుగా విభజించామన్నారు.

అంగవైకల్యం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, వృద్ధులు, సైనికదళాలకు సంబంధించిన వారికి ఇంటి వద్దకే పంపిణీ చేస్తున్నామన్నారు. పట్టణానికి సంబంధించి 19,059 పింఛన్లకు గాను రూ.5,59,98,000 విడుదలైందని, తొలిరోజు 50 శాతం పంపిణీని పూర్తి చేసేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు.



ఈయన పేరు నాగరాజు.అహోబిలం వాసి.. పక్షవాతంతో బాధపడుతున్నాడు. నాలుగేళ్ల క్రితం పక్షవాతం సోకడంతో ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసింది. ప్రస్తుతం వలంటీర్ లేకపోవడంతో సచివాలయం వద్దకు కుమార్తె తీసుకొచ్చింది. చిన్న తోపుడు బండిపై తీసుకురావడానికి అగచాట్లు పడ్డారు.



నాపేరు వెంకటయ్య..మా ఊరు కాదరబాదర. అక్కడ సచివాలయం లేకపోవడంతో శిరివెళ్ల 4వ సచివాలయానికి రావాలి. మా ఊరికి, సచివాలయానికి 3 కి.మీ. దూరం. నేడు పింఛన్ ఇస్తారని తెలియడంతో ఉదయం 7 గంటలకే మా ఊరు నుంచి తెలిసిన వారి మోటార్ సైకిల్ మీద శిరివెళ్లకు వచ్చాను. మధ్యాహ్నం 3 గంటలకు పింఛన్ ఇస్తామని చెప్పడంతో మళ్లీ ఊరికి పోలేక శిరివెళ్లలో ఉండిపోయా.

ఏడీ ‘పింఛన్’

- సచివాలయాల వద్ద పింఛన్లపై ఆగ్రహజ్వాలలు
- నిన్నటి వరకు తెల్లవారక ముందే వలంటీర్లు ఇంటికొచ్చి ఇచ్చేవారు
- బాబు కుట్రతో మళ్లీ సచివాలయాలు, పంచాయతీల వద్ద నిరీక్షణ అంటూ మండిపాటు
- ఈయన వస్తే మా బతుకులు చీకటే అంటూ లబ్ధిదారుల ఈసడింపు
- మజరా గ్రామాల పింఛన్‌దారుల అవస్థలు వర్ణనాతీతం



హరినగరంలో పింఛన్ కోసం వెళ్తున్న చెంచు పెద్ద నరసింహుడు



బి.నాగిరెడ్డినల్లె దర్గా వద్ద గుమిగూడిన పింఛన్‌దారులు



జి.జమ్ములదిన్నెలో ముల్లా హుసేన్‌ను బైక్‌పై తీసుకెళ్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: ఒకటో తారీఖు వచ్చిందంటే వేకువజామునే వలంటీర్ల నుంచి పింఛన్ తీసుకునే లబ్ధిదారులకు ఈ నెల పింఛన్ సొమ్ము కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. మంచం పట్టిన వారు లేవలేని స్థితిలో ఉంటే వారిని కుటుంబ సభ్యులు ఎత్తుకొని పింఛన్ కోసం సచివాలయాల వద్దకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈనెల 3వ తేదీ నుంచి సచివాలయాల వద్ద పింఛన్ పంపిణీ ఉంటుందని ప్రకటించడంతో లబ్ధిదారులు ఉదయం నుంచి సచివాలయాల వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నం వరకు కూర్చున్నా సొమ్ము అందకపోవడంతో అలాగే నిరీక్షించాల్సి వచ్చింది. ఎన్నికల నేపథ్యంలో వలంటీర్లు పింఛన్ల పంపిణీలో పాల్గొనరాదని ఎన్నికల కమిషన్ నిబంధనలు విధించేలా చంద్రబాబు చేసిన కుట్రపై అవ్వాతాతలు, మహిళలు, దివ్యాంగులు మండిపడుతున్నారు.

లబ్ధిదారుల గగ్గోలు

రుద్రవరం:మండలంలో పింఛన్ సొమ్ము తీసుకునేందుకు బుధవారం వృద్ధుల అగచాట్లు వర్ణనాతీతం. నడవలేని, ఒంటరి వారి పరిస్థితి దయనీయంగా మారింది. టీడీపీ కుట్ర కారణంగా ఉదయం నుంచే అష్టకష్టాలు పడుతూ గ్రామ సచివాలయాల వద్దకు చేరుకున్నారు. మజరా గ్రామాల నుంచి సచివాలయాల వద్దకు చేరుకోవడానికి అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఇబ్బందులు తాళలేక..ఇన్ని కష్టాలు రావడానికి కారణమైన చంద్రబాబుపై శాపనార్థాలు పెట్టసాగారు.

ఉయ్యాలవాడ : సామాజిక పింఛన్ల పంపిణీ బుధవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైంది. స్థానిక గ్రామ సచివాలయంలో లబ్ధిదారులకు పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి ఆధ్వర్యంలో 4 కౌంటర్లు ఏర్పాటు చేసి పంపిణీ చేపట్టారు. మండలంలో పింఛన్ల పంపిణీని గ్రామ సచివాలయాల్లో ప్రారంభించినట్లు ఎంపీడీఓ రఘురాం తెలిపారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో పింఛన్ల వివరాలు..

మండలం	మొత్తం పింఛన్లు
ఆళ్లగడ్డ	5,097
ఆళ్లగడ్డ రూరల్	5,082
చాగలమర్రి	6,456
దొర్నిపాడు	3,678
రుద్రవరం	6,534
శిరివెళ్ల	6,465
ఉయ్యాలవాడ	3,983
మొత్తం	37,295



దొర్నిపాడులో మండుటెండలో పింఛన్ కోసం వెళ్తున్న వృద్ధురాలు జయమ్మ



చాగలమర్రి సచివాలయం వద్ద నిరీక్షణ



శిరివెళ్ల మండలం గోవిందపల్లెలో పింఛన్ కోసం ఎండలో నిరీక్షణ









రుద్రవరం సచివాలయానికి ఎదురుగా వేచి ఉన్న పింఛన్‌దారులు, జీనేపల్లె సచివాలయం వద్ద వృద్ధులు, చాకరాజువేముల సచివాలయ వద్ద పింఛన్ కోసం వృద్ధులు, ఉయ్యాలవాడ సచివాలయంలో లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి

తిరోగమనం..

- లబ్ధిదారులకు పింఛన్ కష్టాలు
- 58 నెలలుగా ఇళ్ల వద్దకే పింఛన్లు అందజేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- చంద్రబాబు కుట్రతో మళ్లీ ప్రభుత్వ కార్యాలయాల వద్ద పింఛన్‌దారుల నిరీక్షణ
- టీడీపీ పాలనలోని అవస్థలను గుర్తుకు చేసుకుంటున్న జనం



తెల్లవారుజామునే పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ (ఫైల్)



నంద్యాల 16వ వార్డులో పింఛన్ కోసం ఎదురు చూస్తున్న వృద్ధులు,



అయ్యలూరులో పింఛన్ కోసం వృద్ధుల అగచాట్లు

నంద్యాల (న్యూటౌన్)(అర్బన్)/గోస్పాడు: 58 నెలపాటు లబ్ధిదారులకు ప్రతి నెల ఒకటో తేదీన తెల్లవారుజామునే వలంటీర్లు పింఛన్ అందజేసేవారు. చంద్రబాబు నాయుడు తన మనుషులతో కుట్ర చేయించడంతో వలంటీర్లు పింఛన్ల పంపిణీకి దూరం కావడంతో పింఛన్‌దారులకు కష్టాలు చుట్టుముట్టాయి. సచివాలయాల వద్ద పింఛన్ సొమ్ము అందజేస్తామని చెప్పడంతో పింఛన్‌దారులంతా అక్కడికి పొద్దునే అవస్థలు పడుతూ చేరుకున్నారు. మధ్యాహ్నం రెండు గంటలైనా పంపిణీ చేపట్టకపోవడంతో ఎండకు తాళ లేక, నీరు, తిండి లేక వారి అవస్థలు వర్ణనాతీతం. ఇబ్బందులను చూస్తుంటే మళ్లీ టీడీపీ పాలనను గుర్తుకు తెచ్చిందని పలువురు పేర్కొన్నారు. మమ్మల్ని ఇన్ని కష్టాలకు గురి చేస్తుండటంపై వారు టీడీపీపై శాపనార్థాలు పెట్టారు. కాగా.. పలువురు మంచానికే పరిమితమైన వారు పింఛన్ అందడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక దూర ప్రాంతాల్లోనున్న వారు, ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారి పరిస్థితి ఎటూ తేలడం లేదు. మండలంలో మొత్తం 12 సచివాలయాల పరిధిలో 5,464 మంది పింఛనుదారులు ఉన్నారు.

వృద్ధాప్యంలో ఇబ్బందులు



వలంటీర్లు క్రమం తప్పకుండా ఉదయాన్నే ఇంటికి వచ్చి ప్రతినెల పింఛను ఇస్తుండే వారు. ఈనెల నుంచి సచివాలయం దగ్గర వెళ్లి పింఛన్ తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉంది. కుల మతాలు రాజకీయాలు అనే బేధం లేకుండా వలంటీర్లు సేవలందించి మాకు ఇబ్బంది లేకుండా చేశారు. – వెంకటమ్మ, జూలేపల్లె

మాలాంటి వారికి దిక్కెవరు



గతంలో లాగా పింఛన్ కోసం పడిగాపులుగాయాలంటే ఇబ్బందులే. మా అమ్మాయి లావణ్యకు వెన్నపూస, నరాల సమస్యతో నడవలేని పరిస్థితి. నిన్నటి వరకు ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి పింఛన్ అందజేశారు. ఇప్పుడు వారు లేకపోవడంతో పింఛన్లు ఇచ్చే ప్రదేశానికే వెళ్లి పింఛన్ సొమ్ము తెచ్చుకోవాలంటే కష్టంగా ఉంది. ప్రతి నెలా ఇలాగే అంటే ఏం చేయాలో అర్థం కావడం లేదు. – పెద్దిలావణ్య, తల్లి పెద్ది రమాదేవి, జిల్లెల్ల

పింఛన్ కోసం ఎదురు చూడాల్సి వచ్చింది



పింఛన్ సొమ్ముకు ఎదురు చూడాల్సి వచ్చింది. ఒకటో తేదీనే వస్తుందని ఎదురుచూసినా ఫలితం లేదు.పనులకు వెళ్లేవాళ్లం పింఛన్ కోసం సచివాలయాల వద్దకు వెళ్లి నిరీక్షించాలంటే పనులు కోల్పోతాం. మధ్యాహ్నం రెండు గంటలైనా సచివాలయం వద్ద పింఛన్ ఇవ్వలేదు. – వెంకటస్వామి, జూలేపల్లె, వృద్ధాప్య పింఛన్

పింఛన్‌దారులపై కక్షసాధింపు తగదు



చంద్రబాబునాయుడుకు పింఛన్ దారులపై కక్ష సాధింపు ఎందుకు. వలంటీర్లపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి మాలాంటి వారికి అన్యాయం చేయడం ఎంత వరకు సమంజసం. టీడీపీ హయాంలో ఎలా ఇబ్బందులు పడ్డామో.. ఆ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. ఈ సమస్యకు పరిష్కారం చూపాలి. –హనుమంతరావు, 7వ వార్డు, నంద్యాల

అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

నంద్యాల(సిటీ): నంద్యాల అభివృద్ధి కేవలం వైఎస్సార్‌సీపీ పాలనలోనే జరిగిందని, అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిలిచిందని ఎమ్మెల్యే శిల్పారవి చంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 30వ వార్డు ఎంఎస్ నగర్, 33వ వార్డు జ్ఞానాపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

- ముందుగా 30వ వార్డు ఎంఎస్ నగర్‌లో వార్డు కౌన్సిలర్ పోలూరు లక్ష్మీదేవి, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ పోలూరు రామచంద్రుడుతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో గత అయిదేళ్లలో జరిగిన అభివృద్ధి మునుపెన్నడూ మనం చూడలేదన్నారు. టీడీపీ అభ్యర్థి 17 సంవత్సరాలు వివిధ పదవుల్లో ఉండి కూడా ఎలాంటి మంచి చేశానని చెప్పుకోలేక ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.
- 33వ వార్డు జ్ఞానాపురంలో కౌన్సిలర్ ఎద్దు మనోరంజని, వార్డు ఇన్‌చార్జ్ ఎద్దు రవికుమార్‌తో కలిసి ప్రచారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అవ్వాతాతలకు పింఛన్ల పంపిణీపై చంద్రబాబు కుట్రలు పన్నారని, ఒటకో తేదీన అందాల్సిన సొమ్మును అందకుండా చేశారని మండిపడ్డారు. పట్టణానికి నీటి ఎద్దడి రాకుండా గోరుకల్లు రిజర్వాయర్ నుంచి నీటిని అందించేందుకు రూ.175 కోట్లతో పథకం పూర్తికి కృషి చేస్తానన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళరెడ్డి, సునీతఅమృతరాజ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, సచివాలయాల కన్వీనర్ దాల్‌మిల్ అమీర్ పాల్గొన్నారు.



33వ వార్డు జ్ఞానాపురంలో వైఎస్సార్‌సీపీ చేసిన మంచిని వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

ప్రగతికి ఓటు వేయండి

నంద్యాల(అర్బన్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా కో ఆర్డినేటర్ పీపీ మధుసూదన్‌రెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ విజయశేఖర్‌రెడ్డితో కలిసి బాబానగర్, హైస్కూల్ కొట్టాల, కంపెనీ కొట్టాల గ్రామాల్లో పర్యటించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.



మహిళను ఓటు అడుగుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

సానుభూతి కోసం టీడీపీ నాయకుల అగచాట్లు

- 15వ వార్డు సచివాలయంలో పింఛన్ల పంపిణీలో పాగా వేసిన టీడీపీ నాయకుడు

నంద్యాల(సిటీ): పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరం పెట్టడంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తీవ్రమయ్యాయి. అయితే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో టీడీపీ నాయకులు దిద్దుబాటు చర్యలకు దిగారు. ఆయా వార్డు సచివాలయాల్లో పాగా వేసి సానుభూతి పొందేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా పట్టణంలోని 15వ వార్డులో టీడీపీ నాయకుడు కందాల వేణు సచివాలయంలో కూర్చుని పింఛన్‌కు వచ్చిన లబ్ధిదారులకు నచ్చజెప్పేందుకు యత్నించినట్లు తెలిసింది. అంతేకాకుండా తమపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను తగ్గించే ప్రయత్నించారు.



15వవార్డు సచివాలయంలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న టీడీపీ నాయకుడు కందాల వేణు (వృత్తంలోని వ్యక్తి)

ఖరీఫ్ రాయితీ విత్తనాలకు ప్రతిపాదనలు

నంద్యాల(సెంట్రల్): ఖరీఫ్‌లో రైతులకు రాయితీపై విత్తనాలు అందజేసేందుకు వ్యవసాయ శాఖ చర్యలకు ఉపక్రమించింది. వేరుశనగలో టీసీజీఎస్-1694 రకం 1,401 క్వింటాళ్లు, కే-1812(లేపాక్షి) రకం 1,049 క్వింటాళ్లు, మినుములు (వీబీఎన్-8, టీబీజీ-129, ఎల్‌బీజీ-884) 698 క్వింటాళ్లు, కందులు (పీఆర్‌జీ-176, ఎల్ఆర్‌జీ-105, టీఆర్‌జీ-59) 2,000 క్వింటాళ్లు, పెసలు(ఎల్‌జీజీ-607, ఎల్‌జీజీ-630) 40 క్వింటాళ్లు, కొర్రలు(సూర్యనంది, ఎస్ఐఏ 3156) 20 క్వింటాళ్లు, దైంచా(జీలుగ) 3756 క్వింటాళ్లు, పిల్లిపెసర 30 క్వింటాళ్లు, జనుము 6 క్వింటాళ్లు అవసరమని కమిషనరేట్‌కు జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపారు. ముందస్తుగా ప్రతిపాదనలు పంపడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గిమ్మిక్కులకు జనం ఓట్లు వేయరు

చాగలమర్రి: చంద్రబాబునాయుడు గిమ్మిక్కులు చేస్తున్నారని, అందుకే ఆయనకు ప్రజలు ఓట్లు వేయరని గంగుల అవంతికరెడ్డి, గంగుల సారికారెడ్డి అన్నారు. రాష్ట్రంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో పాలనను కొత్త పుంతలు తొక్కించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాల అమలులో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న వలంటీర్లు ఉంటే జనం తనకు ఓటు వేయరని భావించి చంద్రబాబు కుట్రలకు తెరతీశారని ప్రజలకు వివరించారు. వారు బుధవారం మండలంలోని డి.వనిపెంట, చెంచుగూడెం, డి.కొత్తపల్లె గ్రామాల్లో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిని మళ్లీ గెలిపించాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, సర్పంచ్‌లు బాలీశ్వరరెడ్డి, గోవిందయ్య, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషురమేష్, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ రవి, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి వెంకటరమణ, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు జి.గణేష్‌రెడ్డి, అడ్వకేట్ సరిత పాల్గొన్నారు.



డి.కొత్తపల్లెలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న గంగుల అవంతిక, సారిక

ఐక్య పోరాటాలు నిర్వహించాలి

నంద్యాల(న్యూటౌన్) : కార్మికులు, ఉద్యోగులు, రైతులు ఐక్యపోరాటాలు నిర్వహించి కార్మికరాజ్య స్థాపనకు కృషి చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కార్యాలయంలో 14 మండలాల కార్మికులకు జిల్లా స్థాయి ప్రాంతీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. శాస్త్రీయ ఆలోచన విధానం అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించి ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. తోట మద్దులు, బాలవెంకట్, వెంకటలింగం, నిర్మలమ్మ, మిట్నాల తిరుపతయ్య, గౌస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

రుద్రవరం: స్థానిక బెస్త కాలనీకి చెందిన బాలరాజు అనే యువకుడు బుధవారం మద్యం మత్తులో విషపు పొడిని కలుపుకొని తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.